క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బండారు ప్రసాద్

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని 39వ వార్డులో కోలాటం నేర్చుకున్న 50 మంది మహిళలకు బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్ సహకారంతో స్థానిక బీజేపీ నాయకుడు దాసరి సాయి ఆధ్వర్యంలో మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండారు ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కోలాటం మాస్టర్ తోగోటి రమేష్ చారి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, దాసరి సాయి, బొజ్జ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంఘం ఆధ్వర్యంలో శివుడికి తలపాగా



తలపాగా నేస్తున్న చేనేత కార్మికులు

నకిరేకల్: పట్టణంలోని శివాలయంలో ఈ నెల 8న జరగనున్న మహా శివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణం కోసం స్థానిక చేనేత సంఘం ఆధ్వర్యంలో శివుడికి తలపాగా నేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సంఘం ప్రత్యేకాధికారి రంజిత్, సంఘం మాజీ అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మీనరసయ్య, మూడుదుడ్ల సత్తయ్య, మల్లయ్య, నాయకులు యలగందుల కృష్ణమూర్తి, చిలుకూరి జనార్దన్, దుస్స సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



షీల్డులు అందజేస్తున్న కోదండరాం

నకిరేకల్: ఇటీవల నిర్వహించిన ఐఐటీ రామయ్య 14వ రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో నకిరేకల్‌లోని న్యూవిజన్ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు స్టేట్ టాప్ 10 ర్యాంకులు సాధించారని ఆపాఠశాల ప్రిన్సిపాల్ బి.అశోక్‌కుమార్, పోటీ పరీక్షల ఇన్‌చార్జ్ రంజిత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. విద్యార్థులు కె.లిఖితభవాని(6వ ర్యాంకు), జి.సాత్విక(2), హర్షిత(3), భవ్య హర్షిణి(8), శరణ్య(7),భవ్యశ్రీ(4), రితిష్ (6) పల్లవి(10), సుస్మృత (5)రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రొఫెసర్ కోదండరాం, విద్యావేత్త హనుమాండ్ల ఝాన్సిరెడ్డి చేతుల మీదుగా షీల్డ్‌లు అందజేశారని పేర్కొన్నారు.

ఎల్లమ్మ గుడికి విరాళం



విరాళం అందిస్తున్న మాజీ సర్పంచ్ సౌజన్య

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల వడ్డెరగూడెం ఎల్లమ్మ గుడికి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అందజేసిన రూ.50 వేల విరాళాన్ని మంగళవారం మాజీ సర్పంచ్ సౌజన్య అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు బొంత నరేష్, ప్రభాకర్, లింగయ్య, సైదులు, వెంకన్న, నవీన్, నాగరాజు, జానయ్య, వినయ్, శ్రీకాంత్, గిరి, యాదయ్య నాగయ్య పాల్గొన్నారు.

ఉద్యోగం చేస్తూనే మరో రెండు ఉద్యోగాలకు ఎంపిక



రేణుకాదేవి

నకిరేకల్: పట్టణానికి చెందిన ఉడుత రేణుకాదేవి ఒకవైపు కస్తురిబా పాఠశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూనే తాజాగా మరో రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. నకిరేకల్ పట్టణంలోని వాసవినగర్‌లో నివాసం ఉంటున్న చిగుళ్ల శ్రీనివాస్ భార్య ఉడుత రేణుకాదేవి పది సంవత్సరాలుగా శాలిగౌరారంలోని కస్తూరిబా పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఇటీవల ప్రకటించిన గురుకుల ఫలితాల్లో టీజీటీ హిందీ, పీజీటీ హిందీ ఉద్యోగాలకు ఎంపిక అయింది. కుటుంబం సభ్యుల ప్రోత్సాహంతో ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని రేణుకాదేవి తెలిపారు.

'మహేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

చండూరు: చేనేత కార్మికుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సిరిసిల్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని పద్మశాలి సంఘం చండూరు పట్టణ అధ్యక్షుడు గుర్రం భిక్షమయ్య మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు మహేందర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

నూతన పంచాయతీల్లో వసతులు కరువు

- రేషన్ సరుకులకు 3కి.మీ నడుస్తున్న లబ్ధిదారులు
- అద్దె భవనంలోనే పంచాయతీ భవనం
- ఇబ్బందులు పడుతున్న రాజపేటతండావాసులు



అద్దె భవనంలో కొనసాగుతున్న రాజపేటతండా గ్రామపంచాయతీ భవనం

మర్రిగూడ: నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా మర్రిగూడ పరిధిలోని కమ్మగూడ, కొట్టాల, వెంకేపల్లి, రాజపేటతండాలను గత ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే నూతన గ్రామపంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త గ్రామ పంచాయతీ అయిన రాజపేటతండాలో మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని తండావాసులు పేర్కొంటున్నారు.

నడిచి వెళ్లాలంటే వృద్ధుల పాట్లు

రాజపేటతండాలో 140 కుటుంబాలు 687 మంది ఓటర్లు, వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత గ్రామపంచాయతీ అయిన వట్టిపల్లి నుంచి రాజపేటతండాకు 2–3కి.మీ దూరం ఉంటుంది. ప్రతి నెలా వట్టిపల్లి నుంచి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. వాహనాలు లేని వారు, వృద్ధులు రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కరోనా సమయంలో స్థానిక గ్రామపంచాయతీ భవనంలోనే రేషన్ సరుకులు అందించారు. ప్రస్తుతం కూడా అందులోనే అందిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీ అద్దె రూ.2500

రాజపేటతండా నూతన గ్రామపంచాయతీకి సొంత భవనం నిర్మించలేదు. ప్రతి నెలా గతంలో రూ.2వేలు అద్దె చెల్లించేవారు. కానీ మూడు నెలల నుంచి రూ.500 పెంచడంతో ప్రస్తుతం రూ.2500 అద్దె చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందు రాజపేటతండాలోని ఓ వెంచర్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు కానీ పనులు ప్రారంభం కాలేదు. గ్రామానికి సంబంధించి శ్మశాన వాటిక నిర్మాణం కూడా అసంపూర్తిగానే ఉంది. గ్రామానికి దగ్గరగా ఉండడంలో పనులను నిలిపివేశారు. గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, ప్రజాభిప్రాయం మేరకు శ్మశానవాటికను పూర్తి చేయాలని, సొంత గ్రామపంచాయతీ భవనం ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కృషిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ సరుకులకు తిప్పలు తప్పడం లేదు



రాజాపేటతండాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. కరోనా సమయంలో అందించిన మాదిరిగానే ఇప్పుడు కూడా మా గ్రామపంచాయతీలోనే రేషన్ సరుకులు అందించాలి. ప్రస్తుతం వట్టిపల్లి నుంచే రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. మా గ్రామంలో నూతన రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి.

– కొడాల అంజిరెడ్డి, రాజపేటతండా గ్రామస్తుడు

మౌలిక వసతులు కల్పించాలి



నూతన గ్రామపంచాయతీగా రాజపేటతండా ఏర్పడి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా రేషన్ దుకాణం ఏర్పాటు చేయలేదు. వృద్ధులు రేషన్ సరుకులకు వట్టిపల్లికి వెళ్లి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో కనీసం శ్మశానవాటిక లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలి.

–మారగోని మల్లేష్, రాజపేటతండా

ఆర్డీఓకు ప్రతిపాదనలు పంపాం



రాజపేటతండా గ్రామ పంచాయతీలో నూతన రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో ఆర్డీఓకు ప్రతిపాదనలు పంపాం. ఈ నెలలో రేషన్ దుకాణం ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావొచ్చు. అధికారుల నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేస్తాం.

– బి. శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్

దరఖాస్తుల్లో సవరణకు అవకాశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారి

నల్లగొండ టూటౌన్: ఆరు గ్యారంటీ పథకాల్లో లబ్ధిపొందని వారి నుంచి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌంటర్ ఏర్పాటు చేసి మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. గతంలో ఆరు గ్యారంటీల కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించగా, కొందరు లబ్ధి పొందలేకపోయారు. దాంతో దరఖాస్తుల్లో సవరణ కోసం మరోసారి అన్ని వివరాలతో దరఖాస్తులు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. చాలామందికి గృహజ్యోతి కింద విద్యుత్ సబ్సిడీ వర్తించకపోవడంతో ఒక్కరోజులోనే దాదాపు వంద వరకు దరఖాస్తులు చేసుకున్నారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు ఇవీ..

ప్రజా పాలనలో భాగంగా ఆరు గ్యారంటీల లబ్ధికోసం చేసుకున్న దరఖాస్తుల్లో సవరణలు చేసుకోవడానికి ఈ నెల 6 నుంచి దరఖాస్తులు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి లబ్ధి పొందని వారు ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆధార్ కార్డు జీరాక్స్, తెల్ల రేషన్ కార్డు జీరాక్స్, గ్యాస్ బుక్ జీరాక్స్, సెల్ నంబర్‌తో దరఖాస్తు అందజేయాలన్నారు. 18వ వార్డు ఎల్లమ్మ ఆలయం ఫ్రీడం ఫైటర్ భవన్, 26వ వార్డు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గాంధీపార్కు, 32వ వార్డు శ్రీనగర్ కాలనీ పార్కు, 43వ వార్డు ఔట్‌డోర్ స్టేడియం, 44వ వార్డు మన్యంబావి కమ్యూనిటీ హాల్, 47వ వార్డు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, 10వ వార్డు కనకదుర్గ కాలనీ కమ్యూనిటీ హాల్, 37వ వార్డు రవీంద్రనగర్ పార్కు, 15వ వార్డు చర్లపల్లి వార్డు ఆఫీస్, మున్సిపల్ ఆఫీసులో దరఖాస్తులు చేసుకోవడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

గురుకుల ఉద్యోగాలు సాధించినవారికి సన్మానం



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): గురుకుల ఉద్యోగాలు సాధించిన నాగార్జున ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థులు బి.రమ్య, జి.నాగరాజు, వై.ఎల్లేష్, జి. పరశురాంలను తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిలో చేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్లు వి.శ్రీనివాసులు, డాక్టర్ కె.లక్ష్మణ్ గౌడ్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, అధ్యాపకులు డాక్టర్ ఎస్.దీపిక, ఎస్.లవీందర్‌రెడ్డి, డాక్టర్ వెల్దండి శ్రీధర్, జి.గోవర్ధనగిరి, డాక్టర్ టి.సైదులు, ఎస్.ప్రభాకర్, ఎం.లింగస్వామి, డి.అంజయ్య గ్రంథపాలకులు డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కూలీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలి

కట్టంగూర్ : వ్యవసాయ కార్మికులకు కూలీ బంధు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు, మండల అధ్యక్షుడు ఇటికాల సురేందర్, వనమా అండాలు, గాదనబోయిన కుమార్, మంజుల, వనజ, శ్రీను, మంగమ్మ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చిట్యాల: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మెట్టు పరమేష్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంఘం గ్రామశాఖ కార్యదర్శి మెట్టు మల్లేష్, ఉడుగు సత్తయ్య, మెట్టు నర్సింహ, మెట్టు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

చిట్యాల: పట్టణంలోని పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ని ముప్పయి పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని చిట్యాల మండల సీపీఐ కార్యదర్శి ఎండీ.అక్బర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల పట్టణంలోని పీహెచ్‌సీని మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అజార్‌తో మాట్లాడి ఆస్పత్రిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్బర్ మాట్లాడుతూ రోజువారీగా రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆస్పత్రిలో వసతులు కల్పించాలని, వైద్య సిబ్బందిని నియమించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్, దేశగాని బాలరాజు, మేకల భిక్షం, అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యశిబిరం



వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం శిలార్‌మియాగూడెం ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ శక్తి న్యూ వాయిసెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వంశీకిరణ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఝాన్సీ రాణి, సభ్యులు సుధా, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయుడు మధుబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి వర్తింపజేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మర్రిగూడ: మండలంలోని అర్హులందరికీ గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని కోరుతూ తహసీల్దార్ బి.శ్రీనివాసులుకు సీపీఐ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఖుదాబాక్షపల్లిలో 868 కుటుంబాలకుగాను 486 కుటుంబాలకు మాత్రమే గృహజ్యోతి 200 యూనిట్లు వర్తిస్తోందని మిగతా కుటుంబాలకు కూడా వర్తింపజేసేలా అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్, ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్ ఉన్నారు.

మహిళలు ఆకాశమే హద్దుగా రాణించాలి



నల్లగొండ రూరల్: బహుమతులు అందజేస్తున్న మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్

నల్లగొండ రూరల్: మహిళలు ఆకాశమే హద్దుగా అన్నిరంగాల్లో రాణించాలని నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవవాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం మహిళా కళాశాలలో మెహంది, రంగోలి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని కోరారు. ప్రతి కుటుంబ ఆర్థిక అభివృద్ధికి మహిళనే కీలకం అన్నారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను పెంచాలని, చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అపర్ణ చతుర్వేది, భాగ్యలక్ష్మి, కీర్తి, మహాలక్ష్మి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో క్రీడా పోటీలు

రామగిరి(నల్లగొండ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కడారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు 7వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

మర్రిగూడ: నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఖుదాబాక్షపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కుటుంబానికి బాసటగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పార్వతీ, అంగన్‌వాడీ టీచర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య రాకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య

కట్టంగూర్ : వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు మంచినీటి ఎద్దడిపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవసరమైతే గ్రామాల్లో రైతుల బోరు మోటార్లను అద్దెకు తీసుకొని ప్రజలకు నీరు సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశరావు, సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, మిషన్ భగీరథ ఏఈ నవీన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్‌లో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆ పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్, బొడిగె విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, బొడిగె రాణి, మునుకుంట్ల వేణు, ఈరమల్ల లూసిక, కోనేటి యాదగిరి, మునుకుంట్ల స్వాతి పాల్గొన్నారు.

గృహజ్యోతి వర్తించక లబ్ధిదారుల పాట్లు

చండూరు: గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్ కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న విద్యుత్ వినియోగదారులకు పాట్లు తప్పడం లేదు. 200 యూనిట్లు వినియోగించే లబ్ధిదారులంతా దరఖాస్తు చేసుకుంటే ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగానే ప్రజా పాలనలో వినియోగదారులు దరఖాస్తులు అందించారు. అయితే దరఖాస్తు చేసుకున్న వారిలో సగం మంది వరకే మార్చి నెలలో ఉచిత విద్యుత్ వర్తించింది. మిగిలిన సగం మందికి విద్యుత్ బిల్లులు వచ్చాయి. దీంతో అర్హులైన విద్యుత్ వినియోగదారులు ఎంపీడీఓ, తహసీల్దార్, విద్యుత్ ఏఈ కార్యాలయాల చుట్టూ రెండుమూడు రోజులుగా తిరుగుతూనే ఉన్నారు. సైట్ ఓపెన్ కాకపోవడంతోపాటు ప్రభుత్వం నుంచి తమకు విధివిధానాలు రాలేదని అధికారులు చెబుతున్నారు.



చండూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విద్యుత్ వినియోగదారులు

ఘనంగా సైన్స్ ఫేర్ వేడుకలు



సైన్స్ ఫేర్‌లో పాల్గొన్న విశిష్ట స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

రామగిరి (నల్గొండ): పట్టణంలోని శివాజీనగర్‌లో గల విశిష్ట స్కూల్‌లో మంగళవారం సైన్స్ ఫేర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించి అలరించారు. ఉత్తమ ప్రాజెక్టు ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కీర్తి నందనరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవళిక, ఉపాధ్యాయులు స్వప్న, రేచల్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవా సంస్థల వితరణ



చిట్యాల : సైకిళ్లు అందజేస్తున్న బుచ్చిరెడ్డి



కట్టంగూర్ : పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న సంస్థ సభ్యులు

చిట్యాల: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు రోటరీ క్లబ్ మెంబర్‌షిప్ ఫౌండేషన్ చైర్మన్ ఎంపల్ల బుచ్చిరెడ్డి తెలిపారు. చిట్యాల పట్టణ రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండెబోయిన సైదులుయాదవ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ హైదరాబాద్ నార్త్ జోన్ సభ్యుల సహకారంతో సమకూర్చిన ఐదు సైకిళ్లను మంగళవారం చిట్యాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పట్టణంలో తొమ్మిదో తరగతి చదువుతున్న మంటిపల్లి స్వాతి, జంగిలి నాగలక్ష్మీ, వెలగబోయిన గంగోత్రి, గడే శివానిలకు సైకిళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ జోన్–2 మెంబర్‌షిప్ ఫౌండేషన్ చైర్మన్ గద్దం జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, చిట్యాల క్లబ్ ప్రధానకార్యదర్శి మారగోని రమేష్, సహాయ కార్యదర్శి ఖమ్మంపాటి నర్సింహ, చంద్రశేఖర్, రాజు, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేత

కట్టంగూర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పామనగుండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఇతర సామగ్రిని ఆయన అందజేసి మాట్లాడారు. హెచ్‌ఎం వి.రాఘవాచారి, మాజీ సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, ఉపాధ్యాయుడు బెల్లి ఆంజనేయులు, గుండాల శ్రీను, నూకల చంద్రయ్య, బండారు గణేశ్, నర్సింహ, సాయికుమార్, బండారు మధు, ప్రవీణ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఉచితంగా క్రమబద్ధీకరించాలి

చిట్యాల: ఇంటి స్థలాలకు ఎలాంటి రుసుము లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరించాలని బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం చిట్యాల మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నకిరేకల్‌లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మోత్సవాలకు ఉమామహేశ్వర ఆలయం ముస్తాబు

- భైరవునిబండలో ఈ నెల 7 నుంచి 11 వరకు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ సభ్యులు



భైరవునిబండలోని ఉమామహేశ్వర ఆలయం

శాలిగౌరారం: మండలంలోని భైరవునిబండ గ్రామంలో గల శ్రీగంగాభవాని సమేత శ్రీ ఉమామహేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యింది. ఈ నెల 7 నుంచి 11 వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ఉత్సవ నిర్వాహకులు ముస్తాబు చేశారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

భైరవునిబండ గ్రామంలోని శ్రీగంగాభవాని సమేత శ్రీఉమామహేశ్వర ఆలయం భక్తుల విరాళాలతో దినదినాభివృద్ధి చెందుతోంది. ఐదు దశాబ్దాలుగా బ్రహ్మోత్సవాలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు కనులపండువగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 7న ప్రారంభమై ఈనెల 11న ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, ఆచార్యాది రుత్విక్కరణ, అఖండ దీప స్థాపన, మంటపారాధనలు, రాత్రి శ్రీఉమామహేశ్వర దేవతామూర్తులు కొండ(గుట్ట)పైకి ఆగమించడం, 8న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అగ్నిప్రతిష్ఠ, పీఠదేవతావనాల మంత్ర హోమాలు, రుద్రహోమం, సాయంత్రం ప్రదోషకాలపూజలు, రాత్రి 12 గంటలకు శ్రీఉమామహేశ్వర దేవాతామూర్తుల కల్యాణం, తెల్లవారుఝామున 3 గంటలకు స్వామివారి తలంబ్రాలు, 9న రుద్రహోమం, చండీహోమం, లలితసహస్రనామ పారాయణం, సాయంత్రం మంగళహారతి, మంత్రపుష్పం, 10న నిత్యపూజలు, రుద్రాభిషేకాలు, హోమాధికములు, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణం, అర్చనలు, మంగళహారతి, మంత్రపుష్పం, ఉదయం 10 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణం, సాయంత్రం 4 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ బోనాలు, రాత్రి 10 గంటలకు నాగార్జునసాగర్‌కు చెందిన శ్రీనివాసదాసుతో హరికథా కాలక్షేపం, తెల్లవారుఝామున 4 గంటలకు అగ్నిగుండాలు, 11న నిత్యపూజలు, రుద్రాభిషేకాలు, హోమం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు గిరిప్రదక్షిణలు, సాయంత్రం బలిహరణ, కూష్మాండబలి, అన్నబలి, మహాపూర్ణాహుతి, గరుడముద్ద, మహదాశీర్వచనం, స్వస్తి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రముఖ వేదమూర్తులైన జన్నంపల్లి జ్ఞానాంజనేయశర్మ పర్యవేక్షణలో ఆలయ పూజారి వనం రమేశ్ నేతృత్వంలో జరుగనున్నాయి.

బండరాతిపై తవ్విన బావి

గంగాభవాని సమేత శ్రీఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో పరుచుకొని ఉన్న బండరాతిపై తవ్విన ఆరడుగుల చేదబావిని భక్తులు మహిమాన్వితంగా భావిస్తారు. చుట్టుపక్కల ప్రాంతంలో 60 అడుగులలోతు బోరుబావుల్లో చుక్క నీరులేకున్నా ఆలయ ప్రాంగణంలో కేవలం ఆరడుగుల బావిలో మండు వేసవిలో సైతం నీరు ఉండడం విశేషం. ఈ బావి నీరు తాగితే అంతా శుభం కలుగడంతో పాటూ అనారోగ్య సమస్యలు ఉన్నవారికి మంచి ఫలితం దక్కుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ఒకే ప్రాంగణంలో శైవ, వైష్ణవ ఆలయాలు

భైరవునిబండ గ్రామంలోని శ్రీగంగాభవాని సమేత శ్రీఉమామహేశ్వర ఆలయ ప్రాగణంలో శైవ ఆలయాలైన శివాలయం, అయ్యప్ప ఆలయంతోపాటూ వైష్ణవ ఆలయమైన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాలు ఉన్నాయి. వీటితోపాటూ శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం, గంగామాతా ఆలయం కూడా ఉన్నాయి.